క్లుప్తంగా

బెటాలియన్‌లో వేలం



వేలం నిర్వహిస్తున్న కమాండెంట్ పి.వెంకటరాములు

సత్తుపల్లిరూరల్: మండలంలోని 15వ ప్రత్యేక బెటాలియన్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో గురువారం పాత వస్తువులకు కమాండెంట్ పి.వెంకటరాములు ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలంలో ఎస్ఎస్ స్టోర్, క్యాంప్ స్టోర్, ఎంటి స్టోర్, పనికిరాని వస్తువులు, మోటారు వెహికిల్స్‌కు సంబంధించిన స్పేర్ పార్ట్స్, బ్యాటరీస్, టైర్స్, ట్యూబ్స్, వాడిన ఆయిల్ తదితర వాటిని వేలం వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

ముదిగొండ: మండలంలోని చిరుమర్రి రైతువేదికలో బాణాపురం, చిరుమర్రి, ముదిగొండ సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీడీపీఓ కమలప్రియ, సూపర్‌వైజర్లు, సువర్చల, సావిత్రి, విజయలక్ష్మి, రాజకుమారి, సంధ్యారాణిలు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎరువులు

కారేపల్లి: కారేపల్లి విశాల సహకార పరపతి సంఘం (సొసైటీ)లో రైతులకు ఎరువులు అందుబాటులో ఉన్నట్లు సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, సొసైటీ కార్యదర్శి బొల్లు హన్మంతరావులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యూరియా, 20-20-0-13, డీఏపీ, 28-28-0, పోటాష్, మార్క్‌ఫెడ్ గోల్డ్ కంపోస్టు ఎరువులు అందుబాటులో ఉన్నాన్నా యన్నారు. రైతులు ఆధార్ కార్డు వెంట తెచ్చుకొని సబ్సిడీపై ఎరువులు కొనుగోలు చేయొచ్చని తెలిపారు.

పశువులను సంరక్షించాలి



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మధిర: రైతులంతా పశువులను సంరక్షించుకోవాలని ఆత్కూరు సర్పంచ్ సంధ్యారాణి కోరారు. మండలంలోని ఆత్కూరు గ్రామంలో గురువారం పశు ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పశువులు మన ఆర్థిక స్థితికి, జీవనశైలికి ఎంతో దోహదపడుతున్నాయన్నారు. ఈ శిబిరంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు చేసి, నులిపురుగుల నివారణ మందులు పంపిణీ చేశారు. పశువైద్య సిబ్బంది రఫీ అహ్మద్, లక్ష్మణరావు, కొండలరావు, రమేష్, భాస్కర్, వెంకటేశ్వర్లు, సాయి చంద్రిక, జానీబీ, కరీమూన్, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి..

తల్లాడ: మండలంలోని నారాయణపురం గ్రామంలో ఇటీవల గుండె పోటుతో మృతి చెందిన కళాకారుడు, బీఆర్ఎస్ నాయకులు రెడ్డెం లక్ష్మారెడ్డి దశదిన కర్మకు సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, రైతు బంధు మండల అధ్యక్షుడు వెంకట్‌లాల్, వైరా ఎఎంసీ వైస్ చైర్మన్ భద్రరాజు, జీవీఆర్, కేతినేని చలపతిరావు, శ్రీనివాసరెడ్డి, కోటిరెడ్డి, కిరణ్‌బాబు, రఘు, ఉదయ్ పాల్గొన్నారు.

సాయి మందిరంలో అన్నదానం

సత్తుపల్లి: వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే సండ్ర విజయం సాధించాలని కోరుతూ.. పట్టణంలోని సాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు వల్లభనేని పవన్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మహేష్, ఎంపీపీ హైమావతి, బాబీ, వాసు, ఉమా, ప్రసాద్, శ్రీను, నర్సింహారావు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థికి ఎంబీబీఎస్‌లో సీటు



సాయిసిద్ధు

ఏన్కూరు: మండల కేంద్రంలోని గిరిజన విద్యార్థికి నీట్‌లో ప్రతిభ కనబరిచి వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలో సీటు సాధించాడు. గ్రామానికి చెందిన గుగులోతు సాయిసిద్ధు ఆల్ ఇండియా ఎస్టీ కేటగిరిలో 690 ర్యాంకు, తెలంగాణలో 1330, తెలంగాణ ఎస్టీ విభాగంలో 66 ర్యాంకు సాధించాడు.

‘మూగ’రోదనే..



కల్లూరులోని పశువైద్యశాల

పల్లెల్లో అందని పశువైద్యం

- సబ్ సెంటర్లలో సిబ్బంది కొరత
- మూగజీవాల పరిస్థితి దయనీయం
- నాటువైద్యులను ఆశ్రయిస్తున్న రైతులు
- పట్టించుకోని పాలక యంత్రాంగం

వేంసూరు: వ్యవసాయ అనుబంధ రంగాల్లో పశుపోషణ ఎంతో కీలకం.. వ్యవసాయం తర్వాత రైతు కుటుంబాలు ఎక్కువగా ఆధారపడేవి పశుపోషణపైనే అలాంటి ప్రాధాన్యం కలిగిన పశుసంవర్ధక శాఖలో సరిపడ సిబ్బంది లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పశువులకు ఏదైన జబ్బుచేసి సబ్ సెంటర్లకు తీసుకు వెళ్తే పరిస్థితి అధ్వానంగా ఉంటుంది. సబ్ సెంటర్లు ఎప్పుడు మూస్తారో, ఎప్పుడు తెరుస్తారో తెలియని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

7 సబ్ సెంటర్లలో ముగ్గురు సిబ్బంది..

మండలంలో గేదెలు 16 వేలు, ఆవులు 2వేలు, గొర్రెలు 18వేలు, మేకలు 6వేలు ఉన్నాయి. మండలంలో చౌడవరం, అడసర్లపాడు, కుంచపర్తి, వెంకటపురం, మర్లపాడు, దుద్దెపూడి, కేజీ మల్లెల గ్రామాల్లో ఏర్పాటు చేసిన సబ్ సెంటర్లలో ఇద్దరు ఎల్ఎస్ఏలు, ఒక జేవీఓ మాత్రమే ఉన్నారు. మిగతా నాలుగు సబ్ సెంటర్లకు సిబ్బంది లేకపోవడంతో మూగ జీవాలకు వ్యాధులు సోకితే వేంసూరులోని ప్రధాన వైద్యశాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. ఉన్న ముగ్గురు కూడా ప్రస్తుతం వ్యాక్సిన్ డ్యూటీలో ఉండటంతో మూగ జీవాలకు వైద్యం అందడంలేదు. రాత్రి వేళల్లో ఏ ఆపద వచ్చిన తెల్లవారే వరకు దేవుడు మీద భారం వేసి గడాపాల్సిన పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. దీంతో మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి.

వైద్యం అందడం లేదు..



వేంసూరు మండలంలో సబ్ సెంటర్లలో సరిపడ సిబ్బంది లేకపోవడంతో రైతుల పశువులకు సరైన వైద్యం అందడంలేదు. వ్యవసాయం తరువాత అదే ప్రాధాన్యత కలిగిన పశువులకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి వైద్య సేవలు అందేలా చూడాలి.

– పువ్వాకాయల సోమిరెడ్డి, వెంకటాపురం

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం..



మండలంలో 7 సబ్ సెంటర్లకు ముగ్గురు మాత్రమే ఉన్న కూడా రైతులకు ఇక్కడ ఇబ్బంది లేకుండా నిత్యం అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నాం. ఇద్దరు ఎల్ఎస్ఏలు, జేవీఓతో ఒకవైపు వ్యాక్సిన్ మరోవైపు పశు వైద్య సేవలు అందిస్తున్నాం.

– ఎస్‌కె జానీ, మండల పశువైద్యాధికారి

మధ్యాహ్నం వరకే విధులు..

మండలంలోని సబ్‌సెంటర్లలో పనిచేస్తున్న సిబ్బంది మధ్యాహ్నం వరకే విధులు నిర్వహిస్తున్నారని ఆయా గ్రామాల రైతులు వాపోతున్నారు. ఉదయం9 నుంచి సాయంత్రం 4 వరకు ఉండాల్సిన సిబ్బంది, మధ్యాహ్నం తరువాత సబ్ సెంటర్ మూసివేస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. మధ్యాహ్నం తరువాత పశువులకు ఎదైనా వ్యాధి సంభవిస్తే.. వేంసూరులోని ప్రధాన వైద్యశాలే దిక్కు.. కావునా ఉన్నతాధికారులు స్పందించి సరిపడా సిబ్బందిని నియమించి మూగజీవాలను ఆదుకోవాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

ఇది ఇస్రో శాస్త్రవేత్తల విజయం



సత్తుపల్లి: ఇస్రో ఆకారంలో కూర్చున విద్యార్థులు

సత్తుపల్లి/సత్తుపల్లిరూరల్/తల్లాడ/కల్లూరు: భారత శాస్త్రవేత్తల శాస్త్ర సాంకేతిక పరిజ్ఞాన కృషితో చంద్రయాన్-3 విజయవంతం కావడంతో సత్తుపల్లి మండలం సదాశివునిపేట జెడ్పీహెచ్ఎస్ పాఠశాల హెచ్ఎం మటా అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో జాతీయ జెండాతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అదే విధంగా తల్లాడ మండలంలోని అన్నారుగూడెం జెడ్పీ పాఠశాలలో, సత్తుపల్లి పట్టణంలోని గాంధీనగర్ పాఠశాలలో, కల్లూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తెలంగాణ గ్రామర్ స్కూల్‌లో విద్యార్థులు ఇస్రో ఆకారంలో కూర్చుని విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. అనంతరం కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు శాస్త్రవేత్తలు, మేదావులు చేసిన కృషిని అభినందిస్తూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నర్సయ్య, ఎంఆర్‌కె రెడ్డి, ఎస్‌వీ రావు, శ్రీకుమారి, శ్రీదేవి, భీమయ్య, ఆసీఫ్, హెచ్ఎం చక్రపాణి ఉపాధ్యాయులు నర్సింహారావు, వెంకటేశ్వరరావు, కుమారి, వెంకటేష్, భాగ్యలక్ష్మి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంధు వినియోగించుకోవాలి



బీసీ బంధు యూనిట్లను పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రప్రసాద్

చింతకాని: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బంధు పథకాన్ని లబ్ధిదారులు వినియోగించుకోవాలని మండల పంచాయతీ అధికారి మల్లెల రవీంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని లచ్చగూడెం గ్రామంలో బీసీ బంధు యూనిట్లను గురువారం ఆయన పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. యూనిట్ల ఏర్పాటు కోసం లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేసిన నగదును యూనిట్లను ఏర్పాటు చేసుకునేందుకు ఖర్చు చేయాలన్నారు. ఆర్థిక సాయం పొందిన రైతులు తమ ఎంపిక యూనిట్‌ను తక్షణమే గ్రౌండిగ్ అయ్యేలా పంచాయతీ కార్యదర్శుల వద్ద తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీరామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



మాట్లాడుతున్న సంభాని చంద్రశేఖర్

పెనుబల్లి: రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. గురువారం పెనుబల్లిలో బూత్‌లెవల్ ఏజెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను ఇంటింటికీ చేరవేయాలని, అలాగే బీఆర్ఎస్, బీజేపీ పార్టీల కుమ్మకు రాజకీయాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు బైరెడ్డి మనోహర్‌రెడ్డి, నాయకులు కిరణ్, మండల అధ్యక్షుడు రాజబాబు, ఎస్సీ సెల్ నాయకులు కాంతయ్య, రవి పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం..

ఏన్కూరు: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని వైరా నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుడు బానోత్ బాలాజీ నాయక్ తెలిపారు. గురువారం మండలంలోని భగవాన్‌నాయక్ తండాలో గడపగడపకు సోనియమ్మ సారే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2023లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో మాలోత్ నర్సింహారావు, శోభన్‌నాయక్ పాల్గొన్నారు.

సొసైటీ ఎదుట రైతుల ఆందోళన



కొణిజర్ల సొసైటీ ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు, నాయకులు

కొణిజర్ల: కొణిజర్లలోని గోపవరం సొసైటీలో గేదెల రుణాలపై అధిక వడ్డీలు మాఫీ చేసి పంట రుణంలోకి మార్చాలని డిమాండ్ చేస్తూ గురువారం ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో పలువురు రైతులు సొసైటీ కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆప్ జిల్లా కార్యదర్శి స్వర్ణ సుబ్బారావు మాట్లాడుతూ.. లోన్ ఇచ్చేటప్పుడు సబ్సిడీ ఉంటుందని చెప్పిన అధికారులు సబ్సిడీ ఇవ్వక పోగా అధిక వడ్డీల పేరుతో రైతులపై అధిక భారం మోపుతున్నారన్నారు. తక్షణమే రుణాలు రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కృష్ణ, కుటుంబరావు, కృష్ణారావు, సొసైటీ డైరెక్టర్లు రాయల పుల్లయ్య, సంక్రాంతి నరసయ్య, లక్ష్మీనారాయణలు రైతుల ఆందోళనకు మద్దతు తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత

బోనకల్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన శేషయ్య కుటుంబానికి అమ్మా ఫౌండేషన చైర్మన్ మల్లు నందిని ఆర్థిక సాయం అందించారు. మండలంలోని లక్ష్మీపురానికి చెందిన శేషయ్య మృతి చెందడంతో.. వారి పరిస్థితి తెలుసుకున్న నందిని సాయం అందించారు. అదే గ్రామానికి చెందిన కిలారు చిన్న వెంకటేశ్వర్లు 50 కేజీల బియ్యాన్ని అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రామారావు, ప్రేమ్‌కుమార్, చిత్తూరు మంగ, గౌతమ్, మురళి, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం ..

కల్లూరు: కల్లూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కేన్సర్ బాధితురాలికి రూ.6 వేలు ఆర్థిక సాయం అందించారు. కల్లూరులోని డబుల్‌బెడ్ రూమ్ గృహంలో నివాసముంటున్న బైరి సరిత కేన్సర్ వ్యాధితో బాధపడుతుండగా సమాచారం తెలుసుకున్న కల్లూరు లయన్స్‌క్లబ్ సభ్యులు సాయం, పండ్లు అందించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మన్ చలువాది నగేష్, ప్రెసిడెంట్ దారా సురేష్, ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు, కోశాధికారి సత్యనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పొంగులేటితోనే ప్రయాణం



మాట్లాడుతున్న డాక్టర్ కోట రాంబాబు

మధిర: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితోనే తమ ప్రయాణం కొనసాగుతుందని ఆయన ముఖ్య అనుచరుడు, డాక్టర్ కోట రాంబాబు తెలిపారు. గురువారం మధిరలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల పొంగులేటి అనుచరులు పార్టీ మారారని సోషల్‌మీడియాలో, కొన్ని పత్రికల్లో వస్తున్న వార్తలపై ఎటువంటి వాస్తవం లేదన్నారు. అధికార పార్టీ నాయకులు ఓటమి భయంతో ఇటువంటి ప్రచారాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో దేవిశెట్టి రంగారావు, యన్నం కోటేశ్వర రావు, బండి వెంకటేశ్వర్లు, కాశీ కోటేశ్వరరావు, నండ్రు విజయరావు, కపిలవాయి సత్యనారాయణ రాజు, అక్కినపల్లి నాగేశ్వరరావు, బాహటం శ్రీనివాసరాజు, చిలకా సత్యం, నరసింహారావు, షేక్ జహంగీర్, ఓబుల లక్ష్మారెడ్డి, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్యాంపులు ఏర్పాటు చేయాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్డీఓ గణేష్

ఎర్రుపాలెం: ఓటర్ల నమోదుకు గ్రామాల్లోని బూత్‌ల్లో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని ఖమ్మం ఆర్‌డీఓ గణేష్ మండల తహసీల్దార్ ఉషారాదకు సూచించారు. గురువారం మండలకేంద్రంలోని తహసీల్‌ను ఆయన సందర్శించారు. ఓటర్లు నమోదులు, తొలగింపులు తదితర అంశాలపై చర్చించారు. రికార్డులు పరిశీలన చేశారు. ఈ సమావేశంలో డీటీ టి.కరుణాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

సాయిబాబా ఆలయానికి 1.120 కేజీల వెండి వితరణ



సాయిబాబా ఆలయానికి వెండి అందజేస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లిలోని జేవీఆర్ పార్కు ఎదురుగా గల శ్రీసాయి మందిరంలోని బాబాకు పట్టణానికి చెందిన వ్యాపారి కొత్తూరు రాజా కుమార్తె, అల్లుడు పల్లబోతు హర్షవర్ధన్, హారికలు రూ.81వేల విలువైన 1.120 కేజీల విలువైన వెండిని గురువారం వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు సాంబశివరావు, అడపా సాయి పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

తల్లాడ: 25 నుంచి మూడురోజుల పాటు హన్మకొండ జిల్లాలో జరిగే డీవైఎఫ్ఐ రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని డీవైఎఫ్ఐ ఖమ్మం జిల్లా నాయకుడు నరేష్ అన్నారు. గురువారం తల్లాడలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ తరగతులను డీవైఎఫ్ఐ అఖిల భారత కార్యదర్శి హిమఘ్న రాజ్ భట్టాచార్య ప్రారంభిస్తారని తెలిపారు.

ఆపద్బాంధవుడిలా సీఎం కేసీఆర్



వైరా: దివ్యాంగులకు పెన్షన్ సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్



సత్తుపల్లిటౌన్: పెన్షన్ ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

వైరా/సత్తుపల్లిటౌన్: అభాగ్యులకు, దివ్యాంగులకు సీఎం కేసీఆర్ ఆపద్భాందవుడిలా మారాడని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. గురువారం వైరాలోని ఎస్‌వీఎస్ గార్డెన్స్‌లో, సత్తుపల్లిలోని స్థానిక శ్రీలక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో దివ్యాంగులకు పెరిగిన పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైరా నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 4,231 మంది దివ్యాంగులకు పింఛన్ రూ.3,016 నుంచి రూ.4,016కు పెరిగిందన్నారు. దాదాపు రూ. 1.68 కోట్లు వైరా నియోజకవర్గంలోనే పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కావున వీరందరూ ఓటుతో సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞత తీర్చుకోవాలన్నారు. ముచ్చటగా మూడో సారి ముఖ్య మంత్రిని చేయాలన్నారు. సత్తుపల్లిలో సభ అనంతరం ఎమ్మెల్యే సండ్ర దివ్యాంగులకు భోజనాలు ఏర్పాటు చేసి స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పఠాని వెంకటేశ్వర్లు, మున్సిపల్ వైస్ చైర్మన్ సీతారాములు, ఎంపీపీ పావని, జెడ్పీటీసీ కనకదుర్గ, నాయకులు రత్నం, కృష్ణార్జునరావు, శకుంతల, వెంకటేశ్వర్లు, సక్కుబాయి, ఉమాశంకర్, డీఆర్‌డీఏ ఏపీడీ జయశ్రీ, ఆర్డీఓ అశోక్ చక్రవర్తి, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఎంపీపీ హైమావతి, మున్సిపల్ కమిషనర్ కె.సుజాత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వర రావు, ఆత్మ చైర్మన్ వాసు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, రామారావు, రఫీ, అంకమరాజు, వివిధ మండలాల ఎంపీడీఓలు, కౌన్సిలర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు అండగా ప్రభుత్వం

మధిర: దివ్యాంగులకు మరింత అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఆసరా పెన్షన్‌ను పెంచిందని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ తెలిపారు. స్థానిక రైతు వేదికలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన దివ్యాంగులకు ప్రొసీడింగ్ పత్రాలు అందజేసి మాట్లాడారు. జిల్లాలో ప్రతినెల సదరం క్యాంపులు నిర్వహిస్తున్నామని, అర్హులైన దివ్యాంగులు పరీక్షలు చేయించుకుని సర్టిఫికెట్ తీసుకోవచ్చని, తద్వారా పింఛన్ వస్తుందని చెప్పారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, రైతుబంధు సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, ఎంపీపీ లలిత, ఆత్మ కమిటీ చైర్మన్ గుర్రం రామారావు, కమిషనర్ అంబటి రమాదేవి, ఎంపీడీఓ సిలార్ సాహెబ్ పాల్గొన్నారు.



మధిర: పెన్షన్ ప్రొసీడింగ్స్ అందిస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

నియోజకవర్గ అభివృద్ధికి కృషి..

ముదిగొండ: మధిర నియోజకవర్గ అభివృద్ధికి తనవంతు కృషి చేశానని, ఇక ముందు కూడా చేస్తానని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ తెలిపారు. మండలంలని అమ్మపేటలో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.10లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఎంపీపీ హరిప్రసాద్‌తో పాటు ప్రసాద్, లక్ష్మారెడ్డి, వెంకట్‌గౌడ్, పద్మనాభాచార్యులు పాల్గొన్నారు.

జీఓ 59 దరఖాస్తు ఇల్లు కూల్చివేత



రేకుల ఇంటిని కూల్చివేసిన దృశ్యం

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని కాకర్లపల్లిరోడ్‌లో గురువారం జీఓ నంబర్ 59 కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుని ఇంటిని అధికారులు కూల్చివేశారు. కాకర్లపల్లిరోడ్‌కు చెందిన భూక్యా పద్మ 2010లో 390 గజాల అసైన్‌మెంట్ భూమిలో రేకుల ఇల్లు నిర్మించింది. అప్పటి నుంచి ఇంటి పన్ను, కరెంట్ బిల్లు చెల్లిస్తున్నారు. దీనికి జీఓ నంబర్ 59లో దరఖాస్తు చేసుకోగా రూ.44 లక్షలు చెల్లించాలని నోటీసు వచ్చింది. అంత చెల్లించలేమని అధికారుల వద్ద వాపోయారు. అధికారులు ఇష్టానుసారంగా ఇంటిని కూల్చివేయటం తగదని దీనిపై కలెక్టర్‌ను కలుస్తామని తెలిపారు. గిరిజనులకు చేసే న్యాయం ఇదేనా అని ప్రశ్నించారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం



కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

ముదిగొండ: మండలంలోని గోకినేపల్లిలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి వికలాంగులు గురువారం పాలాభిషేకం చేశారు. పింఛన్ రూ.3 వేల నుంచి రూ.4,016లకు పెంచడంతో హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు మీగడ శ్రీనివాస్‌యాదవ్, వికలాంగులు పాల్గొన్నారు.

గ్రామీణ రహదారులకు మహర్దశ



రహదారి పనులను పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు

కల్లూరు రూరల్: కల్లూరు మండలంలోని గ్రామీణ రహదారులకు మహర్దశ కలిగింది. శివారు గ్రామాలకు లింకు రోడ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 95కోట్ల వ్యయంతో సిమెంటు రోడ్డు, బీటీ రోడ్ల నిర్మాణం పనులు చేపట్టారు. ఈ సందర్భంగా నిధులు కేటాయించిన ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామారావు, జెడ్పీటీసీ అజయ్‌కుమార్, ఎంపీపీ రఘు తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెనుబల్లి : పెనుబల్లి 132/33 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలోని పెనుబల్లి 33/11కేవీ, తుమ్మలపల్లిలోని 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాల్లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. కావున ఈ ఉపకేంద్రాల పరిధిలోని గ్రామ ప్రజలు సహకరించాలన్నారు.

నేడు బీఆర్ఎస్ ర్యాలీ

ఏన్కూరు: మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ బాదావత్ బుజ్జీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వైరా టికెట్ మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్‌కు కేటాయించిన తరువాత తొలిసారిగా వైరా వస్తున్నందున స్వాగతం పలికేందుకు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. మధ్యాహ్నం 12 గంటలకు మార్కెట్‌యార్డు నుంచి వైరా వరకు ర్యాలీ కొనసాగుతుందని తెలిపారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరావు

ఎర్రుపాలెం: మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దేవరకొండ శిరీష అధ్యక్షతన గురువారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని బనిగండ్లపాడు సర్పంచ్ పుల్లారెడ్డి, పెద్దగోపవరం ఎంపీటీసీ కిశోర్‌లు అధికారులను కోరారు. రెవెన్యూ పరమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని తహసీల్దార్ ఉషాశారద సభ్యులకు సూచించారు. ‘గృహలక్ష్మి’దరఖాస్తుల నివేదికను ప్రభుత్వం దృష్టికి పంపినట్లు ఎంపీడీఓ శ్రీనివాసరావు వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ శీలం కవిత, ఆర్‌అండ్‌బీ ఏఈ రాజేష్, ఏసీడీపీఓ కృష్ణ శ్రీ, సూపరింటెంట్ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉషోదయ మండల మహిళా సమాఖ్య..



మాట్లాడుతున్న ఏపీఎం వెంకట్రామారావు

కల్లూరు: కల్లూరులోని స్త్రీ శక్తి భవన్‌లో గురువారం ఉషోదయ మండల మహిళా సమాఖ్య సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏపీఎం ఎం.వెంకట్రామారావు మాట్లాడుతూ.. 2022-23 గ్రామ సంఘాలు ఆడిట్ అయ్యి అన్ని గ్రామ సంఘాలు లాభాల్లో ఉన్నాయని, బ్యాంక్ లింకేజీ ద్వారా 223 సంఘాలకు రూ.18.51 కోట్లు రుణాలు తీసుకోవడం జరిగిందన్నారు. తీసుకున్న రుణాలను సభ్యులు సకాలంలో చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సీబీఓ ఆడిటర్ జనార్ధన్‌రావు, సీసీలు వెంకటేశ్వర్లు, శ్యామలాదేవి, వెంకట్రావమ్మ, సమైఖ్య సభ్యులు గుగులోత్ నిర్మల, శైలజ, సహనాజ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.